జగన్‌పై బిజెపికి ఎందుకంత ప్రేమ : టిడిపి

ఆమదాలవలస : ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిపై బిజెపికి ఎందుకంత ప్రేమో నోరు విప్పి ప్రజలకు చెప్పాలని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ అన్నారు. పట్టణంలోని టిడిపి కార్యాలయం వద్ద నియోజకవర్గ టిడిపి బూత్ కన్వీనర్లు, ఏజెంట్లు నేను సైతం బాబుకు మద్దతుగా రిలే నిరాహార దీక్షలో సోమవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో మద్యం ద్వారా రూ.40 వేల కోట్ల అవినీతికి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పాల్పడ్డారని, దీనిపై సిబిఐ విచారణ చేయాలని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు దగ్గుబాటి పురందేశ్వరి డిమాండ్ చేస్తుంటే, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోందని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాద్, తెలుగు మహిళ జిల్లా అధ్యక్షులు తమ్మినేని సుజాత, టిడిపి నాయకులు మొదలవలస రమేష్, తమ్మినేని విద్యాసాగర్, నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల ఆగ్రహం

- హామీల విస్మరణ, ప్రభుత్వ నిర్బంధంపై మండిపాటు
- కలెక్టరేట్ వద్ద ధర్నా
- లోపలకు చొచ్చుకువెళ్లేందుకు యత్నం
- 42 మంది అరెస్టు, విడుదల

శ్రీకాకుళం కలెక్టరేట్ వద్ద బైఠాయించిన అంగన్‌వాడీలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

తెలంగాణ కంటే అదనంగా రూ.వెయ్యి వేతనం అమలు, ఇతర సమస్యల పరిష్కారం కోసం అంగన్‌వాడీలు రోడ్డెక్కారు. తమను విజయవాడ వెళ్లనీయకుండా ప్రభుత్వం అరెస్టులకు పాల్పడడంపై తీవ్ర ఆగ్రహంతో ఉన్న అంగన్‌వాడీలు కలెక్టరేట్ వద్ద సోమవారం నిర్వహించిన ధర్నాకు జిల్లా నలుమూలల నుంచి వేలాది మంది తరలివచ్చారు. ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యాన తొలుత ఆర్అండ్‌బి అతిథిగృహం నుంచి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ప్రవేశద్వారం వద్ద బైఠాయించి ఆందోళనకు దిగారు. అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, ఇచ్చిన హామీలను అమలు చేయాలని, ప్రభుత్వ నిర్బంధం నశించాలంటూ పెద్దపెట్టున నినాదాలు చేశారు. అనంతరం కలెక్టరేట్ లోపలకు చొచ్చుకు వెళ్లేందుకు ప్రయత్నించడంతో వారికి, పోలీసులకు మధ్య తోపులాట చోటుచేసుకుంది. పోలీసులను తప్పించుకుంటూ అంగన్‌వాడీలు ముందుకెళ్లడంతో వారిని అడ్డుకుని వాహనాల్లోకి ఎక్కించారు. ఆందోళనకు సంఘీభావం తెలిపేందుకు వచ్చిన సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్.అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు అంగన్వాడీ యూనియన్ నాయకులు కె.కళ్యాణితో పాటు 42 మందిని అరెస్టు చేసి ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం సొంత పూచీకత్తుపై విడిచిపెట్టారు.

అంగన్వాడీ కార్యకర్తను అరెస్టు చేస్తున్న పోలీసులు

కలెక్టరేట్ వద్ద నిర్వహించిన ధర్నానుద్దేశించి యూనియన్ జిల్లా అధ్యక్షులు కె కళ్యాణి, సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్.అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు, శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ కె.నాగమణి మాట్లాడుతూ తెలంగాణ కంటే అదనంగా రూ.వెయ్యి వేతనాలు పెంచుతామని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీ అమలు చేయకుండా మోసం చేశారని విమర్శించారు. అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీలు అందరికీ సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీ అమలు చేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.ఐదు లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వేతనంలో సగం పెన్షన్ ఇవ్వాలన్నారు. మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని, మినీ వర్కర్లకు మెయిన్ వర్కర్లతో సమానంగా వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీలకు గౌరవ వేతనం పేరుతో అతి తక్కువ వేతనాలు ఇస్తూ అమ్మఒడి, చేయూత, ఆసరా, ఇళ్లస్థలాలు వంటి సంక్షేమ పథకాలు నిలుపుదల చేశారని చెప్పారు. అంగన్‌వాడీలకు సంక్షేమ పథకాలను వర్తింప జేయాలన్నారు. హెల్పర్ల ప్రమోషన్లలో రాజకీయ జోక్యం అరికట్టాలని కోరారు. అంగన్వాడీలకు వేతనంతో కూడిన మెడికల్ లీవ్ సౌకర్యం కల్పించాలని, రిటైర్మెంట్ వయసు 62 సంవత్సరాలకు పెంచాలని డిమాండ్ చేశారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెనూ ఛార్జీలు పెంచాలని, గ్యాస్‌ను ప్రభుత్వమే సరఫరా చేయాలని కోరారు. ప్రభుత్వం 2017 నుంచి చెల్లించాల్సిన టిఎ బిల్లులు, ఇతర బకాయిలు వెంటనే చెల్లించాలని కోరారు. లబ్ధిదారులకు నాణ్యమైన ఆహారాన్ని సరఫరా చేయాలని, ఆయిల్, కందిపప్పు పరిమాణం పెంచాలని డిమాండ్ చేశారు. యుటిఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి పి.అప్పారావు, ఎస్.కిశోర్ కుమార్, రాష్ట్ర నాయకులు చౌదరి రవీంద్ర ఆందోళనలకు సంఘీభావం తెలిపారు.

పోలీసులకు ఝలక్

అంగన్‌వాడీల ఆందోళనల నేపథ్యంలో కలెక్టరేట్ వద్ద భారీగా పోలీసులు మోహరించారు. అంగన్‌వాడీలను అరెస్టు చేసేందుకు వాహనాలను సైతం సిద్ధంగా ఉంచారు. ఆర్అండ్‌బి అతిథిగృహం నుంచి ర్యాలీగా వచ్చిన అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లను పోలీసులు అడ్డుకోవడంతో కలెక్టరేట్ గేటు ఎదుట బైఠాయించి ఆందోళనకు దిగారు. ఆందోళనల తర్వాత వారంతా ఇళ్లకు వెళ్లిపోతారని భావించిన పోలీసులు చెట్ల నీడలో సేదతీరారు. ధర్నా ముగిసిన తర్వాత అనూహ్యంగా కలెక్టరేట్ లోపలకు వెళ్లేందుకు ప్రయత్నించడంతో కంగుతున్న పోలీసులు ఒక్కసారిగా చేరుకుని వారిని వాహనాల్లోకి ఎక్కించి ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఆందోళనలకు సంఘీభావం తెలిపేందుకు అక్కడికి వచ్చిన సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు ద్విచక్ర వాహనాన్ని పోలీసులు ఆపి వారి వాహనంలో స్టేషన్‌కు తరలించారు. అరెస్టయిన వారిలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు పి.లతాదేవి, జె.కాంచన, పి.ఆదిలక్ష్మి, కె.సుజాత, రాజేశ్వరి, మంజుల, భూలక్ష్మి, సిఐటియు నాయకులు ఎ.సత్యనారాయణ, ఎం.ఆదినారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పలాసలో నిరసన ర్యాలీ

పలాసలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యాన కాశీబుగ్గ బస్టాండ్ నుంచి ఐసిడిఎస్ కార్యాలయం వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఐసిడిఎస్ పిఒ డి.శర్వాణికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి, అంగన్వాడీ యూనియన్ నాయకులు బి.సునీత, ఎల్.దమయంతి, బి.చామంతి, బి.తులసి, జె.శైలజ తదితరులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురంలో మానవహారం

ఇచ్ఛాపురంలో అంగన్వాడీలు స్థానిక తహశీల్దార్ కార్యాలయం నుంచి బస్టాండ్ కూడలి వరకు మానవహారం నిర్వహించి, అనంతరం ధర్నా చేపట్టారు. పట్టణ, రూరల్ ఎస్ఐలు గోవిందరావు, రమేష్ ఆధ్వర్యాన పోలీసులు అంగన్‌వాడీలను అక్కడ్నుంచి పంపించే క్రమంలో వారి మధ్య తోపులాట చోటుచేసుకుంది. అంగన్‌వాడీల ఆందోళనకు టిడిపి, జనసేన నాయకులు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ, అంగన్వాడీ యూనియన్ నాయకులు హైమావతి, విజయ తదితరులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : మానవహారం నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న ఫ్యాప్టో నాయకులు, ఉపాధ్యాయులు

మాస్టార్ల మండిపాటు

- జిపిఎస్ వద్దు... ఒపిఎస్ ముద్దంటూ నినాదాలు
- ఫ్యాప్టో ఆధ్వర్యాన చలో కలెక్టరేట్
- భారీగా తరలివచ్చిన ఉపాధ్యాయులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

గ్యారంటీ పెన్షన్ స్కీం (జిపిఎస్)కు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలపడంపై మాస్టార్లు మండిపడ్డారు. ఫ్యాప్టో ఆధ్వర్యాన సోమవారం నిర్వహించిన చలో కలెక్టరేట్‌కు జిల్లా నలుమూలల నుంచి భారీగా ఉపాధ్యాయులు తరలివచ్చారు. జిపిఎస్ వద్దు... ఒపిఎస్ ముద్దు, మీకు పెన్షన్... మాకు టెన్షనా అంటూ పెద్దపెట్టున నినాదాలు చేశారు. అధికారంలోకి వస్తే వారం రోజుల్లో సిపిఎస్ రద్దు చేస్తామని హామీనిచ్చి మోసం చేశారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒపిఎస్ అమలు చేయకుంటే ఉద్యోగులు బుద్ధి చెప్తారంటూ హెచ్చరించారు.

కలెక్టరేట్ వద్ద ధర్నానుద్దేశించి ఫ్యాప్టో జిల్లా చైర్మన్ మజ్జి మదన్మోహన్, సెక్రటరీ జనరల్ కొమ్ము అప్పలరాజు, రాష్ట్ర నాయకులు చౌదరి రవీంద్ర మాట్లాడుతూ రాష్ట్ర మంత్రివర్గం జిపిఎస్‌ను ఆమోదిస్తూ నిర్ణయం తీసుకోవడంపై తీవ్రంగా మండిపడ్డారు. అధికారంలోకి వస్తే వారం రోజుల్లో సిపిఎస్ రద్దు చేస్తామంటూ చెప్పిన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి నాలుగున్నరేళ్లయినా హామీని నిలబెట్టుకోకుండా మోసం చేశారని విమర్శించారు. జిపిఎస్‌ను తెచ్చి ఉపాధ్యాయులు, ఉద్యోగులను మోసపుచ్చేందుకు సిద్ధమయ్యారని ధ్వజమెత్తారు. పాత పెన్షన్ విధానం తప్ప మరేదీ ఆమోదించేది లేదని తేల్చిచెప్పారు. సంఘాల నాయకులు, సిపిఎస్ ఉద్యోగులు ఉపాధ్యాయులకు సిపిఎస్, జిపిఎస్ వల్ల ఏమాత్రం ప్రయోజనం కాదని జిపిఎస్ మోసమని అంకెల గారడీ అన్నారు. గతంలో ప్రభుత్వం ప్రకటించిన పిఆర్‌సిలో అంకెలను గారడీ చేసి ఉపాధ్యాయులను మోసం చేశారని గుర్తుచేశారు. పిఆర్‌సి మాదిరిగానే జిపిఎస్ విధానం తీసుకొచ్చేందుకు ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందని దుయ్యబట్టారు. ఎన్నికల హామీగా ఇచ్చిన పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలని లేనిపక్షంలో ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సిపిఎస్ రద్దు చేస్తామని మాట ఇచ్చి జిపిఎస్ పేరుతో సిపిఎస్ విధానాన్ని అమలు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఉద్యోగ సంఘాలన్నీ ఏకమై పోరాటంతో ఎదుర్కొంటామని పిలుపునిచ్చారు. ప్రపంచీకరణలో భాగంగా ప్రభుత్వం ఉద్యోగులను క్రమక్రమంగా వదిలించుకునే విధానాల్లో భాగంగానే పాలకులు సిపిఎస్, జిపిఎస్ అమలు చేసేందుకు సిద్ధమవుతున్నారని విమర్శించారు. అరెస్టులు, నిర్బంధాలతో ఉపాధ్యాయుల ఉద్యోగుల ఆందోళనలను ఆపలేరని చెప్పారు. ప్రభుత్వం నడవాలంటే ఉద్యోగుల సహకారం అవసరమని, ఆ ఉద్యోగుల సంక్షేమాన్ని విస్మరించిన రోజు ప్రభుత్వాలకు భవిష్యత్ ఉండదని తేల్చిచెప్పారు. ఉద్యోగులు, ఉపాధ్యాయుల సంక్షేమం చూడాల్సిన బాధ్యత ప్రభుత్వాల మీద ఉందని, అది విస్మరించి ఉపాధ్యాయులకు పెన్షన్ నిరాకరించటం సమంజసం కాదన్నారు. ధర్నాలో ఫ్యాప్టో భాగస్వామ్య సంఘాల నాయకులు ఎస్.కిశోర్‌కుమార్, పి.అప్పారావు, కె.భానుమూర్తి, టి.చలపతిరావు, వి.కామేశ్వరరావు, ఎస్.వి రమణ, పి.రామారావు, ప్రతాప్, కె.ధర్మారావు, పి.ప్రభాకరరావు, కె.డేనియల్, తాతారావు, తంగి మురళి, పి.వసంతరావు తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీల్లో జిల్లాకు పతకాలు

శ్రీకాకుళం అర్బన్ : విజయవాడ, విశాఖపట్నం కేంద్రాల్లో ఇటీవల నిర్వహించిన జాతీయస్థాయి కుంగ్‌ఫు, కరాటే పోటీల్లో సిక్కోలు విద్యార్థులు సత్తా చాటారు. పది బంగారు, నాలుగు వెండి, మూడు రజత పతకాలు అందుకున్నారు. వారికి నగరంలోని ఏడు రోడ్ల కూడలిలోని కళ్యాణ మండపంలో సాయిబాబాస్ మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన మెడల్స్, సర్టిఫికేట్లను సోమవారం అందజేశారు. ఎపిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె.వేణుగోపాల్, లయన్స్ ఇంటర్నేషనల్ జిల్లా చైర్మన్ నటుకుల మోహన్, వాకర్స్ ఇంటర్నేషనల్ డిప్యూటీ గవర్నర్ కొంక్యాన మురళీధర్, చిన్నీస్ నెట్ జోన్ అధినేత కెల్ల కిషోర్ తదితరులు విద్యార్థులను అభినందించారు.

వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

అర్జీలు రీ ఓపెనైతే చర్యలు తప్పవు

- నిర్లక్ష్యం వహించే అధికారులకు షోకాజ్ నోటీసులు
- కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

స్పందనలో రీ ఓపెన్ అవుతున్న వినతులు, జగనన్నకు చెబుదాంలో సంతృప్తి చెందని దరఖాస్తుదారులు, ఎపి పోర్టల్‌లో పెండింగ్‌లో ఉన్న అర్జీలపై కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా పలు సమస్యలపై వచ్చిన 187 మంది తమ సమస్యల పరిష్కారాన్ని కోరుతూ వినతిపత్రాలను అందజేశారు. స్పందన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రెవెన్యూ, పంచాయతీరాజ్, పోలీస్ శాఖ, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, సర్వే, సివిల్ సప్లై, ఐసిడిఎస్, గ్రామీణ నీటి సరఫరా విభాగాల్లో ఎక్కువగా పెండింగ్‌లో ఉంటునట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు 45 సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని, ఆడిట్ బృందం వీటిని పున్ణపరిశీలించి తగిన పరిష్కారం చూపాలన్నారు. సరైన సమాధానం ఇవ్వని అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. ఇప్పటికైనా వీటిపై ప్రత్యేక దష్టి సారించాలని, లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. స్పందన అనంతరం ప్రభుత్వ అధికారులతో ఆయన మాట్లాడుతూ ఉద్యోగులంతా ప్రజలకు సేవకులుగా భావించి, జవాబుదారీతనంతో పని చేయాలన్నారు. స్పందనలో వచ్చిన వినతులకు 24 గంటల నుంచి ఐదు రోజుల్లోగా పరిష్కారం చూపాలన్నారు. ఇచ్చిన సమాధానంతో ఫిర్యాదుదారులు సంతప్తి చెందాలని, సంతృప్తి చెందితే తరచూ రీ ఓపెన్ ఎందుకు అవుతున్నాయని ప్రశ్నించారు.

మహిళా మార్టులో టార్గెట్లు సరికాదు

జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, మెప్మా సంయుక్తంగా నిర్వహిస్తున్న చేయూత మహిళా మార్టులో క్రయ విక్రయాలపై మహిళా సంఘాలకు లక్ష్యాలు నిర్దేశించడం తగదని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎ.మహాలక్ష్మి, విఒఎల సంఘం జిల్లా కార్యదర్శి జి.అసిరినాయుడు వినతిపత్రం అందించారు. తనకు బియ్యం కార్డును రద్దు చేసి పెన్షన్ లేకుండా చేశారని శ్రీకాకుళం రూరల్ మండలం కల్లేపల్లికి చెందిన ఆదిలక్ష్మి వినతిపత్రాన్ని అందజేశారు. వ్యవసాయ పనులకు అవసరమైన విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నారని లావేరు, రణస్థలం మండలాలకు చెందిన పలువురు రైతులు కోరారు. చంద్రబాబుపై అక్రమ కేసులు ఎత్తివేయాలని టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు పి.ఎం.జె బాబు తదితరులు వినతిపత్రం ఇచ్చారు. వీటితో పాటు పలు వ్యక్తిగత, సామాజిక సమస్యలపై పులువురు అర్జీలు అందించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, డిఆర్‌ఒ గణపతిరావు, డిఆర్‌డిఎ పీడీ విద్యాసాగర్, పంచాయతీ అధికారి వి.రవికుమార్, డిఎంహెచ్‌ఒ బి.మీనాక్షి, జిల్లా సరఫరాల అధికారి డి.వెంకటరమణ, పలు శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కొబ్బరి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి

ఎపి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.మోహనరావు

ప్రజాశక్తి - పలాస, కంచిలి

ఆర్‌డిఒ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న నాయకులు, కొబ్బరి రైతులు

కొబ్బరి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని, వెయ్యి కొబ్బరి కాయలకు రూ.15 వేలు కనీస ధర ఇవ్వాలని ఎపి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోనారి మోహనరావు డిమాండ్ చేశారు. పలాస ఆర్‌డిఒ కార్యాలయం వద్ద కొబ్బరి రైతుసంఘం ఆధ్వర్యంలో సోమవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాఫెడ్, ఆయిల్ ఫెడ్ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుల నుంచి కొబ్బరి కాయలు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కొబ్బరి రైతులకు ధరల స్థిరీకరణ పథకం వర్తింప చేయాలన్నారు. జిల్లాలో కొబ్బరి ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేయాలని, ఎర్రనల్లి, తెల్లదోమ వంటి తెగుళ్ల నివారణకు చర్యలు చేపట్టాలని కోరారు. ఉద్యాన శాఖ ద్వారా కొబ్బరి రైతులకు సబ్సిడీ పథకాలు అందించాలని, కేంద్ర ప్రభుత్వం విదేశీ కొబ్బరి ఉత్పత్తుల దిగుమతులను నిషేధించాలని, 90 శాతం సబ్సిడీతో డ్రిప్ పరికరాలు అందించాలని కోరారు. వ్యవసాయ పంపు సెట్లకు మీటర్లు బిగింపు ఆపాలని, ఉచిత విద్యుత్ పథకాన్ని యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో వేలాది ఎకరాలలో కొబ్బరి పంటను రైతులు సాగు చేస్తున్నారని, కొబ్బరి కాయలకు కనీస ధరలు రాక తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎకరా కొబ్బరి తోటకు ఏడాదికి రూ.40 వేలకు పైగా పెట్టుబడి అవుతోందన్నారు. అనంతరం ఆర్‌డిఒ కార్యాలయం ఎఒ పి.ప్రభకు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో జీడి రైతుసంఘం జిల్లా కన్వీనర్ తెప్పల అజయ్ కుమార్, కొబ్బరి రైతు సంఘం నాయకులు ఎం.జోగారావు, ఎం.కామేశ్వరరావు, పి.తాతారావు, వి.సాంబమూర్తి, వజ్రపుకొత్తూరు రైతు సంఘం మండల అధ్యక్షుడు కె.బాలాజీరావు పాల్గొన్నారు.

కంచిలిలో సచివాలయ కార్యదర్శికి వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో రైతుసంఘం నాయకులు కె.గోపీనాథ్, ఆబోతు ఢిల్లీరావు, మన్మథరావు, జోగయ్య, రామయ్య, దాసు పాల్గొన్నారు.

మరిన్ని వార్తల కోసం
epaper.prajasakti.com

'ఆరోగ్య సురక్ష'కు ఏర్పాట్లు పూర్తి

కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

త్వరలో ప్రారంభం కానున్న జగనన్న ఆరోగ్య సురక్షకు సంబంధించి జిల్లాలో ఇంటింటినీ సందర్శించి మ్యాపింగ్ ప్రక్రియను పూర్తి చేసినట్లు కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ తెలిపారు. ప్రత్యేక వైద్య శిబిరాల నిర్వహణకు సంబంధించి ప్రణాళికలు రూపొందించామని చెప్పారు. కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో కలిసి సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఏ ఇంట్లో ఎవరెవరు అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారో గుర్తించే ప్రక్రియ చివరి దశలో ఉందని వెల్లడించారు. జిల్లావ్యాప్తంగా ఆరోగ్య సురక్ష పథకం కింద 30 రోజుల పాటు ప్రత్యేకంగా వైద్య శిబిరాలను నిర్వహిస్తామన్నారు. మండలానికి ఒక గ్రామం చొప్పున ప్రతిరోజూ వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తొలుత 594 సచివాలయాలతో పాటు 13 పట్టణ ఆరోగ్య కేంద్రాల ద్వారా కార్యక్రమ నిర్వహణ కోసం మ్యాపింగ్ చేసినట్లు చెప్పారు. శిబిరంలో 105 రకాల మందులు అందుబాటులో ఉంచనున్నట్లు వెల్లడించారు. శిబిరాలకు వచ్చే రోగులకు భోజన సదుపాయం కల్పిస్తామని, ప్రతి శిబిరంలో కనీసం ఇద్దరు స్పెషలిస్టు డాక్టర్లు, ఇద్దరు పిహెచ్‌సి వైద్యులు ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రుల నుంచి ఒక స్పెషలిస్టు వైద్యుడు హాజరయ్యేలా చూడాలని వైద్యశాఖాధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఇంటింటికీ వెళ్లి వాలంటీర్లతో టోకెన్లు అందజేయడం, వారి గ్రామాల్లో నిర్వహించే వైద్య శిబిరాల తేదీపై ముందుగా అందరికీ తెలిసేలా ప్రచారం చేయాలని సూచించారు. సమావేశంలో డిఎంహెచ్‌ఒ బి.మీనాక్షి, జెడ్‌పి సిఇఒ ఆర్.వెంకట్రామన్, ఐసిడిఎస్ పీడీ బి.శాంతిశ్రీ, ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ ప్రకాశరావు, గ్రామ, వార్డు సచివాలయాల అధికారి వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

27న కలెక్టరేట్ వద్ద ధర్నా

- విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా నిరసన : వామపక్షాలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యుత్ భారాలకు నిరసనగా ఈనెల 27వ తేదీన కలెక్టరేట్ వద్ద ధర్నా చేపడుతున్నట్లు సిపిఎం, సిపిఐ జిల్లా కార్యదర్శులు డి.గోవిందరావు, బి.శ్రీరామ్మూర్తి తెలిపారు. ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు భవిరి కృష్ణమూర్తి అధ్యక్షతన నగరంలోని క్రాంతిభవన్‌లో సోమవారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ వడ్డీ పేరుతో మరో రూ.1500 కోట్లు రాష్ట్ర ప్రజలపై విద్యుత్ భారాలు మోపేందుకు విద్యుత్‌శాఖ ప్రతిపాదన ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. విద్యుత్ రంగాన్ని అదానీ, కార్పొరేట్ సంస్థలకు అప్పజెప్పడానికి పూనుకుందని విమర్శించారు. రైతులకు పంపుసెట్లకు 30 ఏళ్ల పాటు విద్యుత్ ఇవ్వడానికి ఇప్పటికే అదానీతో ఒప్పందం కుదిరిందని ఆరోపించారు. ఇప్పటికే అధిక ధరలు, అదనపు భారాలతో సామాన్య, మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే వడ్డీ పేరుతో మళ్లీ విద్యుత్ భారాలు వేయడం తగదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నాలుగేళ్ల నుంచి విద్యుత్ ఛార్జీల పెంపు, శ్లాబులు మార్చి భారాలు మోపడం, ట్రూ అప్, ఇంధన, కస్టమర్, ఫిక్స్‌డ్, సర్దుబాటు ఛార్జీలు, విద్యుత్ సుంకం పెంచడం, సర్దుబాటు ఛార్జీల పేర్లతో రెట్టింపు భారాన్ని ప్రజలపై మోపారని విమర్శించారు. బిల్లులు చెల్లించలేక ప్రజలు గగ్గోలు పెడుతున్నారని, వ్యాపారాలు దెబ్బతింటున్నాయని, పరిశ్రమలు మూతపడుతున్నాయని, ఉపాధి దెబ్బతింటోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతినెలా జమా ఖర్చులపై విచారణ లేకుండానే యూనిట్‌కు అదనంగా 40 పైసలు చొప్పున సర్దుబాటు ఛార్జీలు వసూలు చేయడం దారుణమన్నారు. ఇప్పటికే విధిస్తున్న సర్దుబాటు ఛార్జీల భారాలను రద్దు చేయాలని కోరారు. సమావేశంలో సిపిఐ జిల్లా నాయకులు కె.భాస్కరరావు చిక్కాల గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గోవిందరావు

రక్తదాతలే ప్రాణ ప్రదాతలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

రక్తదానం చేయడం ద్వారా మరొకరికి ప్రాణ దానం చేయవచ్చని, ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేయాలని అసిస్టెంట్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా అన్నారు. సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్ 18వ వార్షికోత్సవం సందర్భంగా రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంకులో ఆ బ్యాంకు ఉద్యోగులు, కస్టమర్లు సోమవారం రక్తదానం చేశారు. ఈ శిబిరాన్ని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ సేవా పక్వాడ కార్యక్రమంలో భాగంగా అక్టోబర్ 2వ తేదీ వరకు రక్తదాన శిబిరాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు మాట్లాడుతూ మలేరియా, డెంగీ కేసులు పెరుగుతున్నాయని, అవసరమైన ప్లేట్‌లెట్స్ అందించడానికి రక్తం కొరత ఉందన్నారు. శిబిరంలో సిటీ యూనియన్ బ్యాంక్ మేనేజర్ ఎల్.సంతోష్ కుమార్, రెడ్‌క్రాస్ సభ్యులు ఎం.కళ్యాణ్ చక్రవర్తి, పి.చైతన్య కుమార్, కె.సత్యనారాయణ, బ్యాంకు సహాయ మేనేజర్ అరుణ్ కుమార్ నాయక్, పి.ఎన్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

DOCUMENT MISSING

Sri. DHARMANA KALI CHARAN, SURYBHANU PARADISE, PITHAPURAM COLONY, VISAKHAPTNAM URBAN, VISAKHAPTNAM DISTRICT, ANDHRAPRADESH -530003.

On **05.09.2023,** while travelling from Challavanipeta Village to Jalumuru, I lost the below documents

1. Original Sale Deed document bearing No. 434/1998 plot No-6, Sruvey No. 68/1, 68/3, 68/6, Chenai South joint SRO, Chennai District of Surapu Lakshmandas, s/o Narayanswamy, age 70, flat No. B3, First floor, Mukthi enclave, main road, Manapakkam, Chennai - 600125.

2. Original sale deed document bearing No. 577/92-93 Survey no. 21 & 22, Shubh enclave, plot no.3, Ambalipura village, Bangalore district, Bangalore south SRO of Seeta Lakshmi Surapu, D/o Bani rao Surapu and Lakshmandas Surapu, age 40 years.

If someone has found this document, please contact: **(0) 9848726359.**

ఫిర్యాదుదారునితో మాట్లాడుతున్న ఎస్‌పి రాధిక

ఎస్‌పి స్పందనకు 56 అర్జీలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం

స్పందన ఫిర్యాదులపై శాశ్వత పరిష్కారం చూపాలని జి.ఆర్.రాధిక పోలీస్ అధికారులకు ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ మేరకు 56 ఫిర్యాదులను స్వీకరించారు. కుటుంబ తగాదాలకు 8, పౌర సంబంధాలు 15, మోసాలకు సంబంధించినవి 7, ఆస్తి తగాదాలు 9, పాతవి 4, ఇతర ఫిర్యాదులు 13 వచ్చాయి. అనంతరం ఫిర్యాదారులతో ముఖాముఖి మాట్లాడారు. వారి సమస్యలపై సానుకూలంగా స్పందించి ప్రతి ఒక్కరి అర్జీల విషయాలు అడిగి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలోని అధికారులకు తక్షణమే ఫోన్ కాల్ ద్వారా సమాచారం అందించారు. ప్రజా ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. స్పందన ఫిర్యాదులను మీ పరిధిలోని పోలీసు స్టేషన్‌ను ఫిర్యాదు చేయవచ్చునని అన్నారు. ఫిర్యాదుదారుల సమస్యలను నిర్దిష్ట సమయంలో విచారించి పరిష్కరిస్తామన్నారు. స్పందనలో వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ చేపట్టి నిర్దేశించిన గడువులోగా సమస్యలను పరిష్కరిస్తామని భరోసానిచ్చారు. కార్యక్రమంలో ఎఎస్‌పిలు టి.పి. విఠలేశ్వరరావు, జె.తిప్పేస్వామి పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న వంట కార్మికులు

రూ.10 వేల వేతనం చెల్లించాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రాష్ట్ర ప్రభుత్వ మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు నెలకు రూ.10 వేలు వేతనం ఇవ్వాలని, ధరలకు అనుగుణంగా మెనూ ఛార్జీలు పెంచాలని ఎండిఎం యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు అల్లు మహాలక్ష్మి డిమాండ్ చేశారు. ఈ మేరకు జెడ్‌పి కార్యాలయం వద్ద సోమవారం వంట కార్మికులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మధ్యాహ్న భోజన కార్మికులకు గౌరవ వేతనం గౌరవప్రదంగా ఉండే విధంగా ఇస్తామని నమ్మబలికారని గుర్తు చేశారు. అధికారంలోకి నాలుగున్నరేళ్లయినా ఇంతవరకు అమలు చేయలేదని విమర్శించారు. దీనికి తోడు ఈ పథకాన్ని ప్రయివేటు యాజమాన్యాలకు ఇవ్వకుండా కార్మికులకే నిర్వహించేలా చర్యలు తీసుకుంటామన్నారు. కానీ, అందుకు భిన్నంగా ప్రస్తుతం ప్రయివేటు యాజమాన్యాలకు పథకాన్ని కట్టబెట్టి కార్మికులకు అన్యాయం చేస్తున్నారన్నారు. రేషనలైజేషన్ పేరుతో స్కూల్ విలీనం చేయడం వల్ల ఉపాధి కోల్పోతున్న కార్మికులకు ఉపాధి భద్రత కల్పించాలన్నారు. వంట చేస్తూ అగ్నిప్రమాదంలో మృతి చెందిన మలిపెద్ది రమా కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. వంట గ్యాస్‌ను ప్రభుత్వమే సరఫరా చేయాలన్నారు. వంటశాలల వద్ద కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. యూనిఫారాలు, గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. అనంతరం కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు వి.లక్ష్మి, టి.రామానుజమ్మ, ఎం.అన్నపూర్ణ, ఆర్.రాధ, కాంతమ్మ, గీతాబాల, నారాయణమ్మ పాల్గొన్నారు.

మూణ్నాళ్ల ముచ్చటే!

పిల్లలవలస-తోలాపి రోడ్డు మధ్యలో ఏర్పడిన గొయ్యి

- నెల రోజులకే పాడైన బిటి రహదారి
- కల్వర్టుల వద్ద కుంగిన వైనం
- నిర్మాణ సమయంలో కొరవడిన పర్యవేక్షణ

ప్రజాశక్తి- పొందూరు

స్వాతంత్య్రం వచ్చి ఏడు దశాబ్దాలు దాటుతున్నా ఆ గ్రామాలకు సరైన రహదారి లేకపోవడంతో చాలా అవస్థలు పడ్డారు. ఎన్ని ప్రభుత్వాలు మారుతున్నా తమ పరిస్థితి మారడం లేదంటూ ఆవేదన చెందారు. తమ గ్రామాలకు రహదారి మోక్షం ఎప్పుడు కలుగుతుందో? అంటూ ఆశతో ఎదురు చూశారు. దీంతో ఎట్టకేలకు ఇటీవల తమ గ్రామాలకు రాకపోకలు సాగించేలా బిటి రహదారి నిర్మాణం ప్రభుత్వం చేపట్టడంతో ఎంతోగానో ఆనందించి వెళ్లబుచ్చారు. కానీ బిటి రోడ్డు నిర్మించిన నెలరోజులకే పాడైపోయి గోతులు ఏర్పడడంతో మా ఆనందం మూణ్నాళ్ల ముచ్చటగా మారిందంటూ వారంతా ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. ఇదీ మండలంలోని వావిలపల్లిపేట-వి.ఆర్.గూడెం-తోలాపి రహదారి పరిస్థితి.

మండలంలో ఇటీవల చిలకపాలెం-రాజాం రహదారి నుంచి వావిలపల్లిపేట నుంచి వి.ఆర్.గూడెం మీదుగా తోలాపి వరకు కొత్తగా తారురోడ్డును నిర్మించారు. కానీ ఈ రహదారి నిర్మాణం చేపట్టిన నెలరోజులకే రహదారి పాడైంది. ఎక్కడికక్కడే రహదారి ఉఖిడిపోతుండడంతో పాటు కల్వర్టుల వద్ద రహదారి కుంగిపోయి గోతులు ఏర్పడ్డాయి. రహదారి నిర్మాణంలో నాణ్యత లేకపోవడంతో పాటు అధికారుల పర్యవేక్షణ కొరవడడంతోనే ఈ పరిస్థితి నెలకొన్నదంటూ వారంతా ఆరోపిస్తున్నారు.

ఎన్నో గ్రామాల ప్రజలకు ఉపయోగం

మండలంలోని వావిలపల్లిపేట, వి.ఆర్.గూడెం, ధర్మపురం, పిల్లలవలస, తోలాపి గ్రామాలు మీదుగా సుమారు 8 కిలోమీటర్లు గల ఈ రహదారి ఎంతో మందికి ఉపయుక్తమై ఉంది. ఆయా గ్రామాల ప్రజలు జిల్లా కేంద్రానికి చేరుకునేందుకు ఈ రహదారే ఆధారంగా ఉంది. ముఖ్యంగా ఈ రహదారిలోనే ఎపి మోడల్‌స్కూల్ ఉండడంతో నిత్యం ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు రాకపోకలు సాగిస్తుంటారు. రాత్రి వేళల్లో కల్వర్టుల వద్ద కుంగిపోవడంతో వాహనదారులు ప్రమాదాలు బారిన పడుతున్నారంటూ వారంతా ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. ఎంతో ప్రయోజనకరమైన ఈ రహదారిలో పాడైపోయిన చోట్ల మరమ్మతులు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఎంతోకాలంగా సాగిన పనులు

గత ప్రభుత్వం హయాంలో సుమారు రూ.7 కోట్లతో 7 కిలో మీటర్లు పొడవున బిటి రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కొంతమేరకు పనులను చేపట్టి అనంతరం నిలిపివేశారు. ఐదేళ్ల అనంతరం మరలా ఇటీవల నాబార్డు ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్‌లో భాగంగా సుమారు రూ.80 లక్షలతో తారురోడ్డు నిర్మించారు. ఇందులో సుమారు ఏడు కిలోమీటర్లు పొడవున రూ.30 లక్షలతో తారురోడ్డు నిర్మాణం, రూ.10 లక్షలతో ఆరు చోట్ల కల్వర్టుల నిర్మాణం, రూ.10 లక్షలతో రోడ్డు సేఫ్టీలో భాగంగా బోర్డులు, మార్కింగ్ వంటివి చేపట్టారు. మిగిలిన మొత్తం నిధులతో రెండు సంవత్సరాలు పాటు మరమ్మతులు చేపట్టనున్నారు. దీనిపై ఆర్‌ఎండ్‌బి జెఇ ఆంజనేయనాయక్ మాట్లాడుతూ కొత్త రోడ్డు కావడంతో ఒక ఇంచీ కన్నా తక్కువ మందంతో నిర్మాణం జరిపామని, పాడైపోయిన చోట్ల మరలా మరమ్మతులు చేపడతామని తెలిపారు.

చెత్త సంపద కేంద్రం పరిశీలన

మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ నూరుల్ కమర్

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

మేజర్ పంచాయతీ టెక్కలి వంశధార కాలనీ సమీపంలో ఉన్న చెత్త సంపద తయారీ కేంద్రాన్ని టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ అధికారులతో కలిసి సోమవారం పరిశీలించారు. 'కాఫీ విత్ క్లాప్ కార్యక్రమంలో భాగంగా పంచాయతీ పారిశుధ్య కార్మికులతో మాట్లాడుతూ పలు అంశాలపై అవగాహన కల్పించారు. క్లీన్ ఆంధ్రప్రదేశ్ ముఖ్య ఉద్దేశాన్ని సిబ్బందికి వివరించారు. గ్రీన్ అంబాసిడర్లకు గత ఆరు నెలలుగా జీతాలు చెల్లించడం లేదని సబ్ కలెక్టర్ వద్ద ప్రస్తావించగా ఈ సమస్యను జిల్లా కలెక్టర్ దష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఎల్‌పిఒ ఐవి రమణ, టెక్కలి మండల పరిషత్ కార్యాలయ ఎఒ హెచ్‌వి రమణమూర్తి, సర్పంచ్ ప్రతినిధి బసవల ధనుంజయ రావు సిబ్బంది పాల్గొన్నారు.

జలజీవన్ మిషన్ పనులు వేగవంతం

పనులను పరిశీలిస్తున్న భాగ్యలక్ష్మి

జి.సిగడాం : జల జీవన్ మిషన్ పనులను వేగవంతం చేసి, తాగునీరును అందుబాటులోకి తేవాలని ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ బగాది భాగ్యలక్ష్మి అన్నారు. మండలంలోని పెంట గ్రామంలో జరుగుతున్న జనజీవన మిషన్ తాగు నీటి పనులను సోమవారం ఆమె పరిశీలించారు. గ్రామంలోని అన్ని వీధుల్లోనూ పైపులైన్లు ఏర్పాటు, కుళాయిల పాయింట్లు పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాలు పాటించి, ప్రతి ఇంటికి తాగునీరు పైపుల ద్వారా అందించాలని సూచించారు. గడువులోగా పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా పనులను పూర్తి చేయాలన్నారు. ఈ పనులను ఎప్పటికప్పుడు పరిశీలించి ప్రతిరోజు సమాచారం అందించాలన్నారు. మండలంలో జరిగిన జల జీవన్ పనులపై దష్టి సారించాలన్నారు. వీరుతోపాటు గ్రామ సర్పంచ్ పున్నాన సోనియా, ఎంపిటీసీ సభ్యురాలు మక్క శ్రీలత సర్పంచ్ ప్రతినిధి పున్నాన అక్కల నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పట్టాలు మంజూరు చేయాలని వినతి

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

కోటబొమ్మాళి పంచాయతీ దండుమెరకలోని ఏడెకరాల పోరంబోకు భూమిలో 25 మంది దళిత రైతులు 40 ఏళ్లుగా సాగుచేస్తున్నారని, వీటిపై మాకు పూర్తి హక్కును కల్పించి పట్టాదారు పాస్ పుస్తకాలు సిఐటియు నాయకులు హనుమంతు ఈశ్వరరావు కోరారు. ఈ మేరకు తహశీల్దార్ జామి ఈశ్వరమ్మను సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. తాతతండ్రుల నుంచి ఈ స్థలాన్ని చదును చేసి సాగు చేస్తున్నామని రైతులు తెలిపారు. అప్పట్లో ఈ భూముపై మాకు డీ పట్టాలను ఇచ్చారని, దీనిపై రుణాలూ అప్పట్లో తీసుకున్నామని వివరించారు. పదేళ్లుగా ప్రభుత్వ భూమిని సాగుచేస్తున్న రైతులకు ఆ భూమిపై పూర్తి హక్కులు కల్పిస్తామని ప్రభుత్వం ఆదేశాలు జారి చేసిందని, ఆ ఆదేశాలు మేరకు ఈ భూములుపై పూర్తి హక్కులు కల్పించి పట్టాలు మంజూరు చేసి పాస్‌పుస్తకాలు ఇవ్వాలని వినతి పత్రంలో కోరారు. కార్యక్రమంలో కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం నాయకులు ఉర్జాన నర్సింహాలు, జోగి గన్నయ్య, కాళ్ల నర్సింహాలు, దండుమెరక భూమి రైతులు పాల్గొన్నారు.

తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

దరఖాస్తులకు ఆహ్వానం

కోటబొమ్మాళి: స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం పరిధిలోని అంగన్వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న అంగన్వాడీ కార్యకర్తలు, ఆయా పోస్టులకు ఈనెల 30లోగా దరఖాస్తు చేసుకోవాలని ఎంపిడిఒ కె.ఫణీంద్రకుమార్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. మండలంలో కురుడు పంచాయతీ పరిధిలో అంగన్వాడీ-3లో కార్యకర్త (ఎస్‌సి), కోటబొమ్మాళి పంచాయతీలో కోటబొమ్మాళి-6కు ఆయా (బిసిడి), రెడ్డికవీధిలో ఆయా (ఎస్‌టి), చిట్టేవలస-2లో ఆయా (బిసిఎ), భగీరథపురంలో ఆయా (ఒసి)లకు నోటిఫికేషన్ విడుదల చేశామన్నారు. కార్యకర్త పోస్టుకు పది, ఆయా పోస్టులకు 8వ తరగతి ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులన్నారు. 21 నుంచి 35 ఏళ్ల వయసు కలిగి స్థానికులై ఉండాలన్నారు. అసక్తిగల వారు పూర్తి వివరాలతో ఐసిడిఎస్ కార్యాలయానికి సంప్రదించాలని సూచించారు.

విజయను అభినందిస్తున్న కళాశాల సిబ్బంది

మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదం

పలాస : మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతో దోహదపడతాయని శ్రీవిద్యా వాహిని జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పైల తిరుమలరావు అన్నారు. కాశీబుగ్గ విద్యావాహిని డిగ్రీ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న విజయ 36వ ఆంధ్రప్రదేశ్ ఇంటర్ డిస్ట్రిక్ట్ అథ్లెటిక్ చాంపియన్ షిప్-2023 ఆచార్య నాగార్జున యూనివర్సిటీ గుంటురులో సెప్టెంబర్ 22, 23న నిర్వహించిన రాష్ట్రీయ 1500 మీటర్ల అండర్-23 ఉమెన్స్ కేటగిరిలో రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానం, 800 మీటర్లు అండర్- 23 కేటగిరిలో ద్వితీయ స్థానం ఖేలో ఇండియా ఇన్ ఉమన్స్ కేటగిరి 1500 మీటర్లలో తతియ స్థానం కైవసం చేసుకుంది. క్రీడాకారిని విజయను డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ గిరిబాబు, మన్మథరావు, కళాశాల అధ్యాపక సిబ్బంది అభినందించారు.

పోలాకి : పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఉపాధ్యాయులు

క్రీడా పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

పోలాకి: ఈదులవలస ఎపి మోడల్ స్కూల్ విద్యార్థులు జిల్లా స్థాయి క్రీడలు పోటీలకు ఎంపికైనట్లు ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ రామకృష్ణ తెలిపారు. సోమవారం ఎంపికైన విద్యార్థులకు పాఠశాలలో అభినందనలు తెలిపారు. పరుగు పందెంలో అండర్-14 విభాగంలో జి.మధురిమ, జె.సుకన్యా, ఎం.అనుశ్రీ, పి.ఝాన్సీ, పరుగు పందెంలో అండర్-17 విభాగంలో ఎం.విష్ణుప్రియ, పి.తేజేశ్వరి, జి.యశస్విని, పి.యమున ఎంపికైనట్లు తెలిపారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ ఎం.నీలం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పలాస : గుంటూరు విఆర్ స్టేడియంలో ఐస్ స్కేటింగ్ పోటీల్లో కాశీబుగ్గ క్రీడాకారులు తమ ప్రతిభను చాటారు. ఐదేళ్లలోపు ఉన్న బాలికల విభాగంలో 500 మీటర్ల రేసులో జె.తోషిని రాయ్ ప్రథమ స్థానం, ఏడేళ్లలోపు బాలుర విభాగంలో ఎ.అమాన్ తృతీయ స్థానం, 500 మీటర్ల రేసులో బి.రుత్విక్ తృతీయ స్థానం పొందారని శిక్షకుడు జె.గోపాలకృష్ణ తెలిపారు. ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు ఢిల్లీ గురుగ్రాంలో జరిగే జాతీయ స్థాయి ఐస్ స్కేటింగ్ పోటీలకు ఎంపికయ్యారని, రాష్ట్ర ఐస్ స్కేటింగ్ సంఘం అధ్యక్షులు మురళి, కార్యదర్శి షేక్ ఖజామ్‌లు తెలిపారు.

వ్యాసరచన పోటీలో పాల్గొన్న విద్యార్థులు

భగత్‌సింగ్‌పై వ్యాసరచన పోటీలు

నరసన్నపేట : భగత్‌సింగ్ 116వ జయంతి సందర్భంగా అఖిల భారత యువజన సమాఖ్య ఆధ్వర్యంలో సోమవారం శార్వాణి విద్యాలయంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొన్న శ్రీనివాసరావు మాట్లాడుతూ భారత స్వాతంత్య్ర సమరయోధుడిగా, ప్రఖ్యాత ఉద్యమకారుడుగా భగత్ సింగ్ చరిత్రకు ఎక్కారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఎ.రాము, నరసన్నపేట నియోజకవర్గ అధ్యక్షుడు ఎన్.సాంబశివరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉద్యమ నాయకులకు నోటీసులు

పలాస : ఎఐవైఎఫ్, ఎపి ఉద్యోగ పోరాట సమితి ఆధ్వర్యంలో విజయవాడలో మంగళవారం నిర్వహించే స్టేజీ ధర్నాకు వెళ్లనీయకుండా కాశీబుగ్గ పోలీసులు ఎఐవైఎస్ జిల్లా అధ్యక్షుడు గోరు వాసుదేవరావును, శ్రీకాకుళం స్పందనలో ఫిర్యాదు ఇవ్వనీయకుండా ఉండేందుకు టిడిపి నాయకుడు వడ్డీ యాదగిరిని ఇంటి వద్ద ఉదయం 5 గంటలకు కాశీబుగ్గ పోలీసులు చేరుకొని ముందుస్తు అరెస్ట్ చేశారు. అనంతరం కాశీబుగ్గ పోలీసు స్టేషన్‌కు తరలించి మధ్యాహ్నం విడిచి పెట్టారు. ముందుస్తు అరెస్ట్ అయినవారిలో శిక్ష ఉద్యోగులు పి.బాలరాజు, యు.అప్పలరాజు, పి.శేషగిరిరావు తదితరులున్నారు.

సిఆర్‌పికి సన్మానం

పొందూరు: మండలం కింతలి ప్రాథమిక పాఠశాలలో ఇటీవల జిల్లా ఉత్తమ సిఆర్‌పిగా ఎంపికైన లక్ష్మణరావును సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంఇఒ-2 పట్నాన రాజారావు ఆయనకు దుశ్శాలువను కప్పి, జ్ఞాపికను అందించారు. కార్యక్రమంలో స్కూల్ కాంపెక్స్ చైర్మన్ గోవిందరాజులు, ప్రధానోపాధ్యాయులు లీలావతి ఉన్నారు.

లక్ష్మణరావును సత్కరిస్తున్న ఎంఇఒ రాజారావు

పొదుపు నిల్వలు వినియోగించుకోవాలి

మాట్లాడుతున్న ఎపిఎం ప్రసాదరావు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన పెంచుకోవాలని వెలుగు ఎపి ఎం.ప్రసాదరావు మహిళ సంఘాలకు సూచించారు. సోమవారం వెలుగు కార్యాలయంలో వివిధ మహిళా సంఘాలు స్వయం శక్తి సంఘాలకు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంఘంలో నిల్వ ఉన్న పొదుపు తప్పనిసరిగా ఉపయోగించుకోవాలన్నారు. సంఘ సభ్యులు వాడుకునే రుణాలు ఏ అవసరాలకు ఉపయోగిస్తున్నారో, ఎటువంటి ఆదాయ అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నారో అడిగి తెలుసుకొని పలు సూచనలు ఇచ్చారు. ఈ సమావేశం జెఆర్‌పి నాగేశ్వరరావు, అకౌంటెంట్ మోహిని, సిసి మోహన్రావు 35 మంది విఒఎలు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం

ప్రజాశక్తి- కొత్తూరు

నవరత్నాల్లో భాగంగా పేదలకు మంజూరు చేసిన గహ నిర్మాణాలను వేగవంతం చేయాలని ఎంపిడిఒ ఎం.పావని అన్నారు. సోమవారం ఎంపిడిఒ కార్యాలయంలో మండల స్థాయి హౌసింగ్ ఎఇలు, పిఆర్ జెఇలు, ఆర్‌డబ్ల్యుఎస్ జెఇలు, హౌసింగ్ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో 43 పంచాయితీల పరిధిలో పేదలకు 836 గహాలు మంజూరయ్యాయని ఇందులో 136 ఇల్లు నిర్మాణాలు జరుగుతున్నాయని, 156 ఇల్లు స్థల సమస్య నెలకొందన్నారు. ప్రభుత్వం ఇచ్చిన కొలతలకు ప్రభుత్వం ఇచ్చిన స్థలానికి కొలతలు వ్యత్యాసం వుండడంతో సమస్య ఏర్పడిందన్నారు. ఈ సమావేశంలో పిఆర్ ఎఇ గోవింద్, ఆర్‌డబ్ల్యూఎస్ జెఇ గణేష్, మణికంఠ, హౌసింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపిడిఒ పావని

నగదు రహిత లావాదేవీలకు ప్రాధాన్యం

మాట్లాడుతున్న ఎంపిడిఒ చంద్రకుమారి

ప్రజాశకిత- మెళియాపుట్టి

సచివాలయాల పరిధిలో వివిధ పనులకు సంబంధించి నగదు చెల్లించకుండా నేరుగా నగదు రహిత లావాదేవీలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఎంపిడిఒ పి. చంద్రకుమారి అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ కార్యదర్శులు డిజిటల్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లావాదేవీలకు నగదు చెల్లించకుండా ఫోన్ పే చేస్తే సరిపోతుందన్నారు. గ్రామాల్లో శానిటేషన్ విధిగా చేయాలని, బాల్యవివాహాలను అరికట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి తారకేశ్వరి, ఎంపిడిఒ ఎఒ తిరుపతి పట్నాయక్, బ్రెడ్స్ నిర్వాహకులు పోలయ్య, సచివాలయ కార్యదర్శి, డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ

ప్రజాశక్తి- సంతబొమ్మాళి

జగన్నాథపురంలో సర్పంచ్ జోగి రాములమ్మ ప్రధానమంత్రి ఆయుష్మాన్ భారత్, వైఎస్‌ఆర్ ఆరోగ్యశ్రీ కార్డులు సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ ఆరోగ్యశ్రీ కార్డుల ద్వారా రూ.5 లక్షల వరకు ఉచితంగా ఆరోగ్య చికిత్సలు పొందవచ్చునని అన్నారు. మేఘవరం సచివాలయం వద్ద సర్పంచ్ సునీతా శ్రీనివాసరెడ్డి కూడా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిటిసి సూరాడ రాజారావు, కన్వీనర్ రవీంద్రనాథ్ రెడ్డి, కార్యదర్శి విద్య, అశా కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది వలంటీర్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ కార్డులను పంపిణీ చేస్తున్న సర్పంచ్ రాములమ్మ

13వ రోజుకు టిడిపి దీక్ష

పలాస : దీక్షలో కూర్చున్న శివాజీ, శిరీష

ప్రజాశక్తి- జిల్లా విలేకరుల యంత్రాంగం

తెలుగుదేశం జాతీయ అధ్యక్షులు చంద్రబాబు డిమాండ్‌ను నిరసిస్తూ నగరంలోని జిల్లా టిడిపి కార్యాలయం వద్ద చేపట్టిన నిరసన దీక్ష సోమవారానికి 13వ రోజుకు చేరుకుంది. ఇందులో భాగంగా వినూత్న రీతిలో రోడ్డుపై పడుకుని నిరసన తెలిపారు. ముందుగా దీక్షా శిబిరాన్ని మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం కక్షసాధింపు చర్యలను పాల్పడుతూ వ్యవస్థలను నిర్వీర్యం చేశారని ఆరోపించారు. ప్రజాధనాన్ని కొల్లగొట్టి 16 నెలలు జైలులో ఉన్న జగన్ కక్షసాధింపు లక్ష్యంతోనే ముఖ్యమంత్రి అయ్యారని విమర్శించారు. ఈ ధోరణిని ప్రజలు తిప్పి కొట్టాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నగర అధ్యక్షులు మాదారపు వెంకటేష్, ముద్దాడ కృష్ణమూర్తినాయుడు, గుప్త, పి.ఎం.జె.బాబు, తోణంగి వెంకన్న యాదవ్, న్యాయవాదులు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి టిడిపి కార్యాలయం వద్ద చేపట్టిన నిరసన దీక్షలో టిడిపి మండల పార్టీ అధ్యక్షులు బోయిన రమేష్, మాజీ ఎంపిపిలు తర్ర రామకృష్ణ, వెలమల విజయలక్ష్మి, కామేశ్వరరావు, మట్ట సుందరమ్మ, టెక్కలి మండల పార్టీ అధ్యక్షులు బగాది శేషు, సంతబొమ్మాళి మండల పార్టీ అధ్యక్షుడు జీరు భీమారావు, టెక్కలి మండల మహిళ అధ్యక్షులు మెండ దామయంతి పాల్గొన్నారు.

నరసన్నపేట పట్టణంలో యాదవ సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన దీక్షకు మద్దతుగా మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణ మూర్తి పాల్గొని సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో యాదవ సంఘం నాలుగు మండలాల టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్రంలో రాక్షస పాలన కొనసాగుతోందని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష, మాజీ మంత్రి గౌతు శివాజీ అన్నారు. చంద్రబాబు రిమాండ్‌ను నిరసిస్తూ... పలాస కెటి రోడ్డులో నిరసన దీక్ష చేపట్టారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, మాజీ ఎంపిపి వసంతస్వామి పాల్గొన్నారు. సిపిఐ జిల్లా నాయకులు చాపర వెంకటరమణ నిరసన దీక్షకు సంఘీభావం తెలిపారు. ఈయన వెంట నియోజకవర్గ కన్వీనర్ చాపర వేణుగోపాల్, ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు గోరు వాసుదేవరావు, ఎఐవైఎఫ్ నాయకులు రవి ఉన్నారు.

ఇచ్ఛాపురంలో చేపట్టిన దీక్షలో మున్సిపల్ కౌన్సిలర్లు నారాయణ బెహరా, గేదల శేఖర్, ఆశి లీలారాణిలు పాల్గొన్నారు.

రోడ్డుపై పడుకొని నిరసన తెలుపుతున్న నాయకులు

కోటబొమ్మాళి : దీక్ష చేస్తున్న టిడిపి నాయకులు

మహిళకు రక్తదానం

ప్రజాశక్తి- సోంపేట

పట్టణంలోని ప్రయివేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నెలవంకకు చెందిన చంద్రమ్మ అత్యవసరంగా రక్తం అవసరమైంది. సమాచారం తెలుసుకున్న స్థానిక హృదయం ఫౌండేషన్, రోటరీ క్లబ్ సభ్యులు స్పందించి సోమవారం రక్తం అందజేశారు. చంద్రమ్మకు రక్తకణాలు తగ్గిపోవడంతో హృదయం సంస్థ వ్యవస్థాపకుడు కర్రి మిన్నారావు రక్తం అందజేశారు. మిన్నారావును రోటరీ అధ్యక్షుడు శ్రీనివాసరావు, డాక్టర్ లక్ష్మీనారాయణ, వి.శివ శంకరరావు, సాయి అభినందించారు.

రక్తదానం చేస్తున్న మిన్నారావు

సొంతింటి కల నెరవేర్చడమే లక్ష్యం

ప్రజాశక్తి- కవిటి

పేదల సొంతింటి కల నెరవేర్చడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తున్నట్టు ఎంపిపి ప్రతినిధి కడియాల ప్రకాష్ తెలిపారు. మండల గృహ నిర్మాణ శాఖ అధికారులతో సోమవారం సాయంత్రం సమీక్షించిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. మండలంలో 15 లేఔట్లలో ఇప్పటికే 50 ఇళ్లు పూర్తవ్వగా, 423 ఇళు పూర్తి కావస్తున్నాయని, 290 ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయని తెలిపారు. అలాగే సొంత స్థలంలో సుమారు 649 మంది ఇళ్ల నిర్మాణం పూర్తవుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి కర్రి గోపయ్య, ఎఎంసి వైస్ చైర్మన్ యలమంచి నీలయ్య, దూగానపుట్టుగ సర్పంచ్ భద్రాచలం, డిజి పుట్టుగ ఎంపిటిసి సిహెచ్ పూర్ణచంద్రరావు, పిఎసిఎస్ డైరెక్టర్ ఎన్ని అశోక్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ప్రకాష్

'సాగే'దెలా!

ప్రజాశక్తి- సంతబొమ్మాళి

ఖరీఫ్ సీజన్ ప్రారంభమై నాలుగు నెలలు గడిచినా ఇప్పటి వరకు సాగు నీరందక తీరప్రాంత పంచాయతీ రైతులు తీవ్ర అబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలోని మేఘవరం ఆర్ కాలువకు సంబంధించి జిజి ఛానల్ ద్వారా మరువాడ, మేఘవరం, కె.లింగూడు, మూలపేట, కొల్లిపాడు, లక్కివలస పంచాయతీల్లో 15 వందల ఎకరాలకు సాగునీరు అందించడంలో వంశధార అధికారులు విఫలమయ్యారని ఆరోపిస్తున్నారు. జూన్‌లో తేలిక పాటి వర్షాలు పడడంతో కొంత మంది రైతులు వరి నాట్లు వేశారు. జూలైలో ఇంజిన్లతో మరికొంత మంది రైతులు వరి నాట్లు వేశారు. వరినాట్లు వేసిన తరువాత వర్షాలు రాక, చెరువుల్లో నీరు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పలుమార్లు పాలకులకు, అధికారులకు మొరపెట్టుకున్నా కనీసం చుక్క నీరందించ లేకపోయారు. ఏప్రిల్, మే నెలల్లో వంశధార కాలువలు మరమ్మతులు చేయాల్సి ఉంది. కానీ, ఆగస్టు నెలలో తూతూమంత్రంగా చూసి వెళ్లిపోతున్నారు తప్ప రైతులకు ఎటువంటి మేలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాలతలగాం నుంచి మూలపేట వరకు కనీసం కాలువల్లో పేరుకుపోయిన గుర్రపు డెక్కను తొలగించలేని పరిస్థితిలో వంశధార అధికారులు ఉన్నారని విమర్శిస్తున్నారు. గతేడాదీ ఈ తీర ప్రాంత పంచాయతీలకు సాగునీరు అందించలేదు. కానీ రెవెన్యూ అధికారులు నీటి తీరువా కట్టాలని రైతులపై ఒత్తిడి పెంచారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి సాగునీరు అందించాలని కోరుతున్నారు.

చుక్క నీరు లేని వంశధార కాలువ

రామకృష్ణ రాకతో టిడిపి శ్రేణుల్లో ఆనందం

పక్కపక్కనే కూర్చున్న రవికుమార్, రామకృష్ణ

ప్రజాశక్తి- ఆమదాలవలస

టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కూన రవికుమార్‌తో గడచిన కొంతకాలంగా విభేదిస్తూ వస్తున్న బూర్జ మండలం మాజీ జెడ్‌పిటిసి, రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్యక్షులు ఆనెపు రామకృష్ణ చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుకు నిరసనగా పట్టణంలో టిడిపి శ్రేణులు చేపడుతున్న రిలే నిరాహార దీక్షలకు మద్దతు పలుకుతూ సోమవారం జరిగిన దీక్షలో పాల్గొనడంతో టిడిపి శ్రేణుల్లో మబ్బులు తొలగి ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. చంద్రబాబు నాయుడు అరెస్టును నిరసిస్తూ గడచిన 12 రోజులుగా టిడిపి శ్రేణుల ఆధ్వర్యంలో దీక్షలు చేపడుతున్నప్పటికీ ఇంతవరకు అటువైపు తొంగి చూడకుండా ఉన్న ఆనెపు రామకృష్ణ సోమవారం రిలే నిరాహార దీక్షలో ప్రత్యక్షం కావడంతో టిడిపి శ్రేణులు ఒకవైపు ఆనందం వ్యక్తం చేస్తూ మరోవైపు అధిష్టానం ఏమైనా సూచనలు చేసిందా అని చర్చించుకుంటున్నారు. గడచిన స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల నుండి రామకృష్ణకు రవికుమార్‌కు మధ్య మనస్పర్థలు ఏర్పడ్డాయి. దీనికి కారణం స్థానిక సంస్థల తరపున స్వతంత్ర ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఆనెపు రామకృష్ణ పోటీ చేశారు. ఈ నేపథ్యంలో టిడిపి రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు రవికుమార్ ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల పోలింగ్‌లో టిడిపి జడ్‌పిటిసి, ఎంపిటిసి, కౌన్సిలర్లు ఎవరూ పాల్గొనవద్దని ఆదేశించారు. దీంతో నియోజకవర్గంలోని టిడిపి ఎంపిటిసిలు ఎవరు ఓటు వేసేందుకు వెళ్లలేదు. రామకృష్ణకు మిగతా నియోజకవర్గాలలో టిడిపి నుండి సుమారు 110 ఓట్లు పడ్డాయి. అప్పటి నుండి రవికుమార్ రామకృష్ణల మధ్య ఎడబాటుకు కారణమయ్యింది. అప్పటినుండి పార్టీ కార్యక్రమాలలో ఎంపి ఇతర నాయకులతో పాటు పాల్గొంటున్నప్పటికీ రవికుమార్‌తో కలసి ఎటువంటి కార్యక్రమాల్లో కూడా పాలుపంచుకోలేదు. ఇటీవల తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు ప్రాజెక్టుల సందర్శంలో భాగంగా గతంలో వెన్నెల వలస రిజర్వాయర్‌ను సందర్శించినపుడు ఒకే తాటిపై వెళ్లకుండా రెండు వేరువేరు శిబిరాలను నిర్వహించారు. ఈ విషయం అప్పట్లో టిడిపి వర్గాల్లో చర్చనీయాంశమైంది. సోమవారం రిలే నిరాహార దీక్షలో రామకృష్ణ పాల్గొనడం, అది కూడా రవికుమార్ పక్కనే కూర్చోవడం పార్టీ శ్రేణుల ఆనందానికి అవధి లేకుండా పోయింది. ఇప్పటికే నియోజకవర్గంలో వైసిపిలో మూడు పువ్వులు ఆరు గ్రూపులుగా విరాజిల్లుతూ ముందుకు సాగుతున్నదని ఇటువంటి తరుణంలో టిడిపిలో కూడా గ్రూపుల గోల ఏంటని మదనపడే వాళ్ళమని నేటితో ఆ బాధకు తెరపడిందని తెలుగు తమ్ముళ్లు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ప్లకార్డులను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

దేశభక్తిని పెంపొందించేందుకే...

ప్రజాశక్తి- మెళియాపుట్టి

దేశ భక్తిని పెంపొందించేందుకే నా భూమి, నా దేశం కార్యక్రమన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తోందని మండల విద్యాశాఖ అధికారి ఎస్.దేవేంద్రరావు తెలిపారు. మీరా మాటి మేరా దేశ్ కార్యక్రమంలో సోమవారం స్థానిక కెజిబివి పాఠశాలలో ప్రిన్సిపాల్ ఎస్. రమ్య ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని దేశభక్తుల యొక్క ఘనతని, 75 స్వర్ణోత్సవాలను వివరించారు. అనంతరం విద్యార్థులతో ర్యాలీని నిర్వహించి మాట్లాడుతూ జన్మనిచ్చిన నేలతల్లిని, స్వేచ్ఛగా జీవించేందుకు అవకాశం కల్పించిన దేశాన్ని గౌరవించుకునేలా చేపట్టిన నా మట్టి, నా దేశం కార్యక్రమం ఎంతో మహోన్నతమైందన్నారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి ఎం.పద్మనాభరావు కాంప్లెక్స్ చైర్మన్ యు.గణపతిరావు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

మెళియాపుట్టి : విద్యుత్ లైన్లలో మరమ్మతులు మంగళవారం చేయనుండడంతో ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు టెక్కలి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జి.శంకరరావు ఒక ప్రకటనలో తెలిపారు. గొప్పిలి సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ కొత్త లైన్లు వేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

సన్మానిస్తున్న ఎంఇఒ ధనుంజయ మజ్జి

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం

కవిటి: ఉపాధ్యాయుని ఉద్యోగ జీవితంలో బదిలీ అనేది ఓ మజిలీ అని, ప్రతి పాఠశాలలోన తన పాత్ర అనేది కచ్చితంగా ఉంటుందని ఎంఇఒ ధనుంజయ మజ్జి అన్నారు. మండలంలోని కళింగపట్నం మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో పనిచేసి ఇటీవల బదిలీ అయిన జి.రాజేష్, పి.లక్ష్మణరావు, టి.సూర్యం, ఎం.చిన్నమ్ముడు, ఎల్.రజితేంద్రరెడ్డిలను సోమవారం దుశ్శాలువ కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా బదిలీ అయిన ఉపాధ్యాయులు మాట్లాడుతూ తమ అనుభవాలు వివరించి, తమకు సహకరించిన గ్రామస్తులు, పాఠశాల సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

రెండేళ్లలో ప్రజలు మెచ్చే అభివృద్ధి

నరసన్నపేట: నరసన్నపేట మండలంలో గత రెండేళ్లలో సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, యువ నేత ధర్మాన కృష్ణచైతన్యల సహకారంతో ప్రజలు ఆశించే అభివృద్ధి జరిగిందని శిష్టకరణం కార్పొరేషన్ డైరెక్టర్ సదాశివుని కృష్ణ అన్నారు. పాలక వర్గానికి రెండేళ్ల పూర్తయిన సందర్భంగా సోమవారం సత్యవరం గ్రామంలో ఎంపిపి ఆరంగి మురళీధర్‌కు దుశ్శాలువతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎంపిపి కార్యాలయానికి చేరువలో జర్నలిస్టుల కాలనీ రోడ్, కాలువలను మరమ్మతు చేసి అభివృద్ధి చేయాలని కోరారు. శిష్టకరణ సంఘం నాయకులు ఎంవిజె మోహనరావు, వైకుంఠరావు, జగన్నాథరావు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు సన్మానం

సంతబొమ్మాళి : రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కాఫీ విత్ క్లాప్ మిత్ర కార్యక్రమం స్థానిక సర్పంచ్ కళింగపట్నం లక్ష్మి అధ్యక్షతన సంతబొమ్మాళి మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని చెత్త నుంచి సంపద సేకరణ కేంద్రంలో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డివిజనల్ పంచాయతీ అధికారి ఐ.వి.రమణ పారిశుధ్య కార్మికులను సోమవారం సన్మానించారు. డిఎల్‌పిఒ స్థానిక పారిశుధ్య కార్మికులతో కలిసి కాఫీ తాగుతూ వాళ్లను ప్రోత్సహించారు. కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి సిహెచ్.ప్రేమలీల, పంచాయతీ విస్తరణ అధికారి గోపాలరావు, కార్యదర్శుల సంఘం అధ్యక్షుడు దుంప శ్రీనివాసరావు, కార్యదర్శి రాధారాణి, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

సన్మానిస్తున్న నాయకులు

సంఘాలతో రుణ సదుపాయం

ప్రజాశక్తి- పలాస

గొర్రెలు, మేకల పెంపకదారులు సంఘాలుగా ఏర్పడి ప్రభుత్వం నుంచి సబ్సిడీ రుణాలను, ఇతర సౌకర్యాలను పొందవచ్చునని జిల్లా గొర్రెల, మేకల పెంపకదారుల సహకార సంఘం అధ్యక్షులు రాపాక చిన్నారావు యాదవ్ అన్నారు. పలాస మండలం మాకన్నపల్లి పంచాయితీలో ఉన్నటువంటి శ్రీగుడారమ్మ గొర్రెలు, మేకలు పెంపకదారుల సహకార సంఘం సభ్యులతో సమావేశమయ్యారు. ప్రభుత్వం నుంచి రుణాలు ఏవిధంగా పొందాలి, సంఘం ఏర్పాటు చేయడం వంటి విషయాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు సహకారంతో శ్రీకాకుళం జిల్లా గొర్రెలు మేకలు పెంపకందారుల సహకార సంఘం చైర్మన్ నియామకమైన సందర్భంగా మంత్రికి కతజ్ఞతలు తెలిపారు. ఆనంతరం మాకన్నపల్లి పంచాయితీ సర్పంచ్ సైని దేశయ్య అధ్యక్షతన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిటిసి కోరాడ ధనరాజు, ఉప సర్పంచ్ రాపాక పురుషోత్తం, సంఘ ఉపాధ్యక్షులు దాసరి బాలకయ్య, కార్యదర్శి కెవిల్ మూర్తి, మాజీ సర్పంచ్ గేదెల నీలకంఠం, ధర్మారావు. దాసరి దానేష్ పాల్గొన్నారు.

చిన్నారావు యాదవ్‌ను సన్మానిస్తున్న సంఘ నాయకులు

ఉత్సాహంగా విలువిద్య

విలువిద్యలో పాల్గొన్న విద్యార్థులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

విలువ విద్యను వారసత్వపు హక్కుగా ప్రతిఒక్కరూ నేర్చుకోవాలని డిఇఒ ఎం.వెంకటేశ్వరరావు అన్నారు. నగరంలోని ఆదిత్య ఆర్చరీ అకాడమీలో ఆర్చరీ పోటీలను అదనపు ఎస్‌పి విఠలేశ్వరరావు, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఎం.వి.పద్మావతి, టిడిపి నాయకులు గొండ శంకర్‌లతో కలిసి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అకాడమీ డైరెక్టర్ చెటికం రాజ్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాలను అనుసరించి అండర్-14, అండర్-17 విభాగాలకు శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల విద్యార్థుల నుంచి పోటీలను నిర్వహిస్తున్నామని అన్నారు. ఇండియన్ రౌండ్, రికవరీ రౌండ్, కాంపౌండ్ రౌండ్‌ల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీలను పిఇటిల సంఘం ప్రతినిధులు బి.వి.రమణ, ఎం.సాంబమూర్తి, అసోసియేషన్ సెక్రటరీ ఎల్.చిట్టిబాబు పాల్గొన్నారు.

ఎంఆర్‌సికి చేరిన మరుగుదొడ్ల పరికరాలు

కొత్తూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉన్న ఎంఆర్‌సి కార్యాలయానికి పాఠశాలకు మరుగుదొడ్లను పరిశుభ్ర పరిచే పరికరాలను పంపిణీ చేసేందుకు వైపర్ స్టూరిడ్ హ్యాండిల్ 176, రీఫిల్ వైపర్ 176, మాప్ హ్యాండ్స్ 176, రీఫిల్ మాప్స్176, హర్డ్ బ్రిస్టల్ బ్రష్ 264, మరుగుదొడ్ల బ్రష్ 352 పరికరాలు సోమవారం రాష్ట్ర విద్యాశాఖ, మధ్యాహ్న భోజనం, శానిటేషన్ కార్యాలయం నుండి చేరుకున్నాయని ఎంఇఒలు చందక గోవిందరావు, ఎన్.శ్రీనివాసరావు తెలిపారు. వీటిని రెండు రోజుల్లో మండలంలోని పాఠశాలకు పంపిణీ చేస్తామన్నారు.

పరికరాలను భద్రపరుస్తున్న ఎంఆర్‌సి సిబ్బంది

రచ్చకెక్కిన గ్రూపుల గోల

భామిని: నియోజకవర్గంలో ఇన్నాళ్లూ నివురుగప్పిన నిప్పులా ఉన్న గ్రూపు రాజకీయాలు రచ్చకెక్కాయి. మండల కేంద్రంలో సోమవారం పాముల సుజన ఫొటోలను వైసిపి నాయకులు, కార్యకర్తలు దగ్ధం చేశారు. ఎమ్మెల్యే వి.కళావతితోనే నియోజకవర్గం అభివృద్ధి చెందిందని, కొత్తవాళ్లు వచ్చి నియోజకవర్గంలో పార్టీని అప్రతిష్టపాలు చేయొద్దని వైసిపి మండల కన్వీనర్ తోట సింహాచలం అన్నారు. నియోజక వర్గంలో చాపకింద నీరులా కురుపాం ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి సోదరి సుజన, మరిది గువ్వల రమేష్‌బాబు... టిడిపి సానుభూతిపరులతో కలిసి వైసిపిని నష్టపరిచేలా వ్యవహరిస్తున్నారని తెలిపారు. సిఎం జగన్ హయాంలో ఎమ్మెల్యే కళావతితోనే తామంతా ఉంటామని స్పష్టంచేశారు. జెసిఎస్ కోఆర్డినేటర్ కొత్తకోట చంద్రశేఖర్, సర్పంచులు ఎస్.రాజు, పాపి నాయుడు, పిఎసిఎస్ చైర్మన్ గెల్లంకి రమేష్, పాలక ఉషారాణి, వైసిపి నాయకులు ఆంజనేయులు, రొక్కం రమేష్, సంజీవరావు పాల్గొన్నారు.

వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిహెచ్ఒఎస్ రాజేశ్వరి

ఇంటింటా ఆరోగ్య సురక్ష సర్వే

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలోని కోసమాలలో జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా సోమవారం ఇంటింటికీ వెళ్లి వైద్య పరీక్షలు చేసి రోగాలపై సర్వే చేపట్టారు. గ్రామంలో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేసి మెరుగైన వైద్య సేవలను అందిస్తున్నామని సిహెచ్ఒఎస్ రాజేశ్వరి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంటింటికీ వెళ్తూ బిపి, షుగర్, రక్త పరీక్షలు, హిమోగ్లోబిన్, యూరిన్ టెస్ట్, మలేరియా, డెంగీ పరీక్షలు చేసి ప్రజలకు మందులు అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సచివాలయ ఎఎన్ఎం సుధారాణి, ఆశ వర్కర్ సుజాత వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వినాయకుని లడ్డూ వేలం

కోటబొమ్మాళి: వినాయక నవరాత్రుల్లో భాగంగా మండలంలోని దండలో సోమవారం లడ్డును వేలం వేశారు. ఇదే గ్రామానికి చెందిన బాడాన జగ్గారావు రూ.16,001కు దక్కించుకున్నారు. ఈ లడ్డును వినాయక యూత్ కమిటీ సభ్యులు, స్థానిక సర్పంచ్ గొండ చాందిని మురళి జగ్గారావుకు అందజేశారు. అనంతరం కమిటీ సభ్యులు వినాయకుడి నిమజ్జనం ఆటపాటలతో సందడిగా నిర్వహించారు.

ఉత్తమ లఘుచిత్రంగా వనమాలి

వీరఘట్టం: విజయవాడలో ఈ నెల 23, 24న జరిగిన గుర్రం జాషువా 128వ జయంతి ఉత్సవాల్లో భాగంగా తెలుగు షార్ట్ ఫిలిం అసోసియేషన్ నిర్వహించిన లఘుచిత్ర పోటీలలో ఉత్తమ చిత్రంగా వనమాలి నిలిచింది. మొక్కలు నాటే కార్యక్రమం ఆవశ్యకతపై రూపొందిన ఈ చిత్రానికి కె.గౌరునాయుడు దర్శకత్వం వహించారు. ఆయన కిమ్మి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులుగా పనిచేస్తూ లఘు చిత్రాలను చిత్రీకరిస్తున్నారు.